

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2025-26 విద్యా సంవత్సరానికిగాను జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 9 వ తరగతికి నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1007 మంది విద్యార్థులకుగాను 302 మంది హాజరయ్యారని, 705 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. 11వ తరగతికి రెండు పరీక్షా కేంద్రాల్లో 653 మంది విద్యార్థులకుగాను 189 మంది హాజరయ్యారని, 464 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. డిఇఒ రెండు పరీక్ష కేంద్రాలను, పెదవేగి నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఆరు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారని ఆమె తెలిపారు.

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనవరి 29 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు గడిచిపోతున్నా ఇప్పటికీ పట్టణాలు, పల్లెల్లో అధికార పార్టీ ఎంఎల్ఎ, ఎంపీలతో కూడిన ఫ్లెక్సీలను, బోర్డులను తొలగించడంగాని, ముసుగు వేయడంగాని చేయని పరిస్థితి నెలకొంది. అసలు ఎన్నికల కోడ్ అమలులో ఉందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి.

కోడ్ అమలు ఇలాగేనా..!

- పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికారుల నిర్లక్ష్యం
- గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో యథేచ్ఛగా రాజకీయ నేతల ఫ్లెక్సీలు, పోస్టర్లు
- ఎంఎల్ఎ, ఎంపీల ఫ్లెక్సీల జోలికెళ్లేందుకు అధికారుల వెనుకంజ
- అధికారుల తీరుపై విమర్శలు వెల్లువ
- ఎన్నికలు సజావుగా సాగేనా అంటూ చర్చ



కూటమి ప్రభుత్వ అధినేతలతోపాటు ఏలూరు బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరంతోపాటు దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి, రామచంద్రపురం, రాయన్నపాలెం వంటి గ్రామాల్లో ఇప్పటికీ స్థానిక ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, సిఎం, డిప్యూటీ సిఎంల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు పెద్దఎత్తున అలానే ఉన్నాయి. ఇక్కడే కాదు.. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇతర నియోజకవర్గాల్లోనూ చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. జనవరి 29న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వెంటనే ఏలూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి మీడియా సమావేశం ఏర్పాటు చేసి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్ విడుదల రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చినట్లు ప్రకటించారు. మార్చి మూడో తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ నెల పదో తేదీ సోమవారంతో నామినేషన్ల ప్రక్రియ సైతం ముగియనుంది. ఇప్పటి వరకూ 20 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎన్నికలు సజావుగా సాగాలంటే ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్) సక్రమంగా అమలు కావాలి. లేకపోతే అధికార పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర శక్తులు ఇష్టానుసారంగా రెచ్చిపోయే అవకాశం ఉంది. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం, రాజకీయ నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించడం చేయాలి. కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు దాటినా ఇప్పటికీ ఆ ప్రక్రియను అధికారులు పూర్తి చేయలేదు. ఏలూరు పట్టణంలో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేసినప్పటికీ హోర్డింగులు వంటి వాటిని పూర్తిస్థాయిలో తొలగించలేదు. ఇక గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సొసైటీలు, సచివాలయాల ముందు సైతం పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. ఎంఎల్ఎ, ఎంపీల ఫ్లెక్సీల జోలికెళ్లేందుకు అధికారులు వెనుకాడుతున్న పరిస్థితి ఉంది. ఎన్నికల కోడ్ అమలులో అధికారుల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.


ఎంపీతోపాటు దెందులూరు, చింతలపూడి ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ



ఏలూరు కలెక్టరేట్ వద్ద సిఎం చంద్రబాబు ఫొటోతో కూడిన బోర్డు

ఎన్నికలు సజావుగా నిర్వహించేనా..?

ఎన్నికల కోడ్ అమలులో తీవ్ర నిర్లక్ష్యం నెలకొనడంతో ఎన్నికలు దగ్గరపడే కొద్ది పరిస్థితి ఏవిధంగా ఉంటుందనే చర్చ జనాల్లో నెలకొంది. మా గ్రామంలో పోస్టర్లు, ఫ్లెక్సీలు అలానే ఉన్నాయంటూ ఒకరికొకరు ఫోన్లు చేసుకుని మాట్లాడుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార టిడిపి తమ అభ్యర్థిని బరిలో నిలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైంది. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చెందితే ప్రభుత్వ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు గట్టి పోటీదారుగా ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇక్కడ పిడిఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) గెలిచిన సంగతి అందరికీ తెలిసిందే. ఎంఎల్‌సి ఎన్నికల్లో తొలిసారి పిడిఎఫ్ అభ్యర్థి కచ్చా జార్జి విక్టర్ గెలుపొందారు. దీంతో తమ సర్వశక్తులు ఒడ్డి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని టిడిపి, కూటమి నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంఎల్ఎలకు, నియోజకవర్గ పరిశీలకులకు బాధ్యతలు అప్పగించారు. వారంతా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగే పరిస్థితి కన్పిస్తోంది. ఇప్పుడే ఎన్నికల కోడ్ సరిగా అమలు చేయని అధికారులు, ఎన్నికలు సజావుగా నిర్వహిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని అంతా కోరుతున్నారు. కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదులు ఇచ్చేందుకుసైతం చాలామంది సిద్ధమవుతున్నారు.

11, 12 తేదీల్లో మన్యం బంద్


సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే 'మన్యం బంద్'ను జయప్రదం చేయాలని ఆదివాసీ, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, పిడిఎస్‌యు జిల్లా నాయకులు వినోద్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, రైతుసంఘం మండల అధ్యక్షులు వెట్టి వీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఆ చట్టాలను సవరణ చేయడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించి పర్యాటక రంగం అభివృద్ధి చేయొచ్చని, ఆ చట్టాలను సవరణ చేయాలని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అయ్యన్నపాత్రుడు తక్షణం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, గిరిజనులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే మన్యం బంద్‌లో ఆదివాసీ, ప్రజాసంఘాలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని, ఏజెన్సీ ప్రాంతంలోని వర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మడకం పోచమ్మ, మడకం శ్రీదేవి, సోయం శ్రీను, పూనెం శేఖర్, నాగమణి, మడివి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం రోజురోజుకీ దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరులో డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో కళాశాల భవనం పూర్తవుతుందని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా ఇప్పటి వరకు కళాశాల భవనాలకు శంకుస్థాపన కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చిలో ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో తరగతి గదులు సరిపోక డిగ్రీ కాలేజీ విద్యార్థులు చెట్ల కింద కూర్చునే పరిస్థితి ఉందన్నారు. స్థానిక ఎంఎల్ఎ డిగ్రీ కళాశాల సమస్యను పట్టించుకుని పనులు వెంటనే ప్రారంభింపజేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ల్యాబ్‌లు లేని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరులోని సెయింట్ థెరిస్సా డిగ్రీ మహిళా కళాశాలలో ఫీజుల దోపిడీ ఉందని, విద్యార్థులు బయట చెబితే వాళ్లను ఇబ్బంది పెట్టే పరిస్థితి నెలకొందని, దీనివల్ల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్‌రాజా, జిల్లా ఉపాధ్యక్షులు పవన్, పట్టణాధ్యక్షులు మనోజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమలు కాని ఎంఎల్‌సి ఎన్నికల కోడ్

అధికారుల తీరు సరికాదు: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నిబంధనలు అమలు కావడం లేదని, అధికారులు చోద్యం చూస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ గత నెలాఖరునే అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. అయితే దెందు లూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అమలు కావడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ కన్పిస్తున్నాయని తెలిపారు. లింగపాలెం మండలం అయ్యప్పరాజు గూడెం, కలరాయనగూడెం, భోగోలు, కామవరపుకోట తదితర ప్రాంతాల్లో పలుచోట్ల ఫ్లెక్సీ బోర్డులు ఉన్నాయని, అలాగే హైందవ శంఖారావం బోర్డులు ఎన్నికల నిబంధన కిందకు రాకపోయినా అందులో బిజెపి రాష్ట్ర నాయకులు గారపాటి చౌదరి ఫొటో దర్శనమిస్తుందని తెలిపారు. జనసేన జిల్లా ముఖ్య నాయకుడు కరాటం రాంబాబు ఫ్లెక్సీ జంగారెడ్డి గూడెంలో గురవాయిగూడెం తదితరచోటతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉంటే అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, తక్షణం వాటిని తొలగించాలని రవి డిమాండ్ చేశారు.

ప్రజా ఉద్యమాలకు బాసటగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు

పట్టభద్రుల ఎంఎల్‌సిగా దిడ్ల వీర రాఘవులును గెలిపించండి - ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి


జంగారెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరంతరం ప్రజల మేలు కోసం శాసనమండలిలో పోరాడుతూ ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కృషి చేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు గెలుపు కోరుతూ కార్యకర్తల సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ అధికారంలో ఎవరున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, నిర్వాసితులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇలా అన్ని తరగతుల ప్రజల గొంతుకగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు పని చేస్తున్నారని గుర్తు చేశారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలకు ఒక ప్రత్యేకస్థానం, గుర్తింపు ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తానని, డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తానని ఎన్నో ఆశలు చూపించి ఓట్లు దండుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా నిరుద్యోగులకు, ఉద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. అందుకే ప్రశ్నించే గొంతుకలను గెలిపించడం ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుందని, దానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలే సరైన వారని వారు స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎంఎల్‌సిగా బరిలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులను గెలిపించి గ్రాడ్యుయేట్ ఓటర్లు మరోసారి చరిత్ర సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు, యుటిఎఫ్ నేతలు రవికుమార్, ముస్తఫా ఆలీ, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, మహిళా నేత టి.నాగ మణి, నేతలు టి.రామకృష్ణ, జ్యోతిబసు, సుభాషిణి పాల్గొన్నారు.

జామాయిల్ చెట్లు అక్రమంగా నరికివేత



నరికిన జామాయిల్ కలప ఇదే

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు అటవీ ప్రాంతం సోషల్ ఫారెస్టు నర్సరీలో ఆధీనంలో ఉన్న జామాయిల్ చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో సోషల్ ఫారెస్టు శాఖ అటవీ శాఖ భూమిని లీజుకు గతంలోనే తీసుకుంది. ఇందులో పలు మొక్కలను పెంచుతున్నారు. అలా పెరిగిన మొక్కలను ఉపాధి హామీ ద్వారా ప్రతియేటా వర్షాకాలంలో గ్రామాల్లో నాటేందుకు వినియోగిస్తారు. ఈ క్రమంలో కొత్తగా మొక్కలను పెంచేందుకు ఖాళీ స్థలం అందుబాటులో లేదనే నెపంతో ఈ నర్సరీలో సుమారు 15 సెంట్ల భూమిలో ఏపుగా పెరిగిన పలు జామాయిల్ చెట్లను మూడు రోజుల కిందట యంత్రాల సాయంతో నరికి వేరే ప్రాంతానికి తరలించారు. వాస్తవంగా టెండరు విధానం ద్వారా అన్ని అనుమతులతో చెట్లను తొలగించాల్సి ఉంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అటవీ చెట్లను నరకకుండా పర్యావరణాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పోలవరం ప్రాజెక్టు, ఎత్తిపోతల పథకాలు పరిశీలన

హైదరాబాద్ నుంచి వచ్చిన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బృందం



గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టును, పరిసర ప్రాంతాల మేజర్ ఎత్తిపోతల పథకాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు బృందం శనివారం పరిశీలించింది. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎకె ప్రధాన్ నేతృత్వంలో మెంబర్స్ సెక్రటరీ అజగేషన్ బృందం హైదరాబాదు నుంచి రాజమహేంద్రం విమానాశ్రయానికి ప్రత్యేక ఫ్లైటులో చేరుకున్నారు. ఇరిగేషన్ ఇఇ ప్రేమ్‌చంద్, డిఇఇ సత్యదేవ, ఎఇఇ భద్రరావు వారికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా తాడిపూడి వద్ద ఉన్న చింతలపూడి మేజర్ ఎత్తిపోతల పథకం, తాడిపూడి మేజర్ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను డిఇఇ వారికి వివరించారు. అనంతరం బృందం పోలవరం ప్రాజెక్టులో గైడ్ బండ్, డయాఫ్రంవాల్ ప్రాంతాలను పరిశీలించారు. ఇఇ సుధాకర్ ఇతర అధికారులు వారికి సంబంధిత వివరాలను తెలిపారు. ఈ బృందం ఆదివారం పోలవరం ప్రాజెక్టులో పవర్ హౌస్, జంటగుహలు, ఇతర ప్రాంతాలను పరిశీలించనున్నట్లు డిఇఇ తెలిపారు.

సమస్య ఉంటే 112కు తెలపండి

నగరంలో మహిళా రక్షక దళ సభ్యుల పర్యటన


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళా రక్షక దళ సభ్యులు ప్రజల్లో తాము ఉన్నామన్న భరోసాను విస్తృతంగా కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం మహిళా రక్షక దళ సభ్యులు పలు ప్రాంతాల్లో విసిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అంతేకాకుండా ఏలూరు నగరంలో పార్కులు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లో, కూడలి ప్రాంతాల్లో వారు విసిబుల్ పోలీసింగ్ నిర్వహించడమే కాకుండా ద్విచక్రవాహనాలపై సరళ మోత మోగిస్తూ నగరాన్ని చుట్టేశారు. వీరు ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతూ ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వృద్ధులు, మహిళలు అత్యవసర సమయాల్లో 112 నెంబర్‌కే కాకుండా 95550351100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా రక్షక దళ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాలైన వేలేరుపాడు, కుక్కునూరులో గ్రామ సభలు నిర్వహించారు. అయితే గ్రామసభల నిర్వహణ తీరుపై అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలు, జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణ, హెల్మెట్ ధారణ వంటి అంశాల్లో అధికారుల తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో గ్రామసభలు నిర్వహించారు. రెండింటికీ ఐటిడిఎ పిఒ రాములునాయక్ హాజరయ్యారు. ఈ సభకు వందలాది మంది పోలవరం నిర్వాసితులు తరలొచ్చారు. అయితే 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాల నిర్వాసితుల నుంచే వినతులు స్వీకరిస్తామని పిఒ చెప్పడంతో అక్కడికి చేరుకున్న వారంతా తీవ్ర నిరాశ, ఆందోళనకు గురయ్యారు. ఇదేంటని ఆందోళన చేపట్టడంతో ఎట్టకేలకు దిగొచ్చిన పిఒ వినతులు స్వీకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామనడంతో అంతా శాంతించారు. ఇదే పరిస్థితి మరుసటి రోజు కుక్కునూరులోనూ చోటుచేసుకుంది. నిర్వాసితులంతా తమ గోడు మరోసారి వినతిపత్రాల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకుని మండలం యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇవ్వాలనేది నిర్వాసితుల ప్రధాన డిమాండ్. దీంతోపాటు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా ఇక్కడి నుంచే తరలించే రోజే కటాఫ్ తేదీగా పరిగణించి పరిహారం ఇవ్వాలని, మిగులు భూములు, పోడు భూములకు పరిహారం ఇవ్వాలనేవి వారి కోరికలు. అలాగే పునరావాస కాలనీల్లో వసతులు కల్పించాలని, ఉపాధి చూపాలనేది వారి ఆకాంక్ష. ఏదేమైనా గతానికి భిన్నంగా నిర్వాసితుల వినతులు స్వీకరించడం అభినందనీయమే. అయితే నిర్వాసితుల ప్రధాన డిమాండ్లపై అధికారులకన్నా ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామసభల్లో వచ్చిన అంశాల ఆధారంగా ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాకాకుండా పాతపద్ధతిలోనే వ్యవహరిస్తే గ్రామసభ లక్ష్యం నెరవేరదు. పైగా కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మండలం యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించాలని నిర్వాసితులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.



పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అదే సమయంలో కూటమి తరపున బరిలోకి దిగుతున్న పేరాబత్తుల రాజశేఖరం తరపున టిడిపి శ్రేణులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే వారికి ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టమవుతోందని బహిరంగ రహస్యం. ప్రధానంగా ఎనిమిది నెలల కాలంలో ఎన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చారు. డిఎస్‌సి నిర్వహణలో జాప్యమేంటి అని, కనీసం నిరుద్యోగ భృతి అమలు ఎప్పుడు అని నిరుద్యోగులు ప్రశ్నిస్తుంటే టిడిపి నేతలు నీళ్లు నములుతున్నారు. ఇక ఉద్యోగులైతే డిఎలు, బకాయిలపై అడుగుతుంటే సమాధానం చెప్పలేక అధికారదర్పం ప్రదర్శిస్తూ స్థానికంగా చేయగలిగేవి తాము చేస్తామని, మిగిలినవి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి చేయిస్తామని, ఏదేమైనా తమ అభ్యర్థికే ఓటు వేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఈ పనుల్లో ఎంపీలు, ఎంఎల్ఎలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగడం గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆలోచనల్లో పడేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇదే క్రమంలో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరపున పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నేతలు విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ప్రధానంగా శాసనమండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రజల గొంతుకగా ఎలా వ్యవహరిస్తున్నారు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటి అనేది వివరిస్తుండటం అందరినీ ఆకర్షిస్తోంది. పిడిఎఫ్ తన ప్రచారంలో చేసిన కృషి, దేనికోసం భవిష్యత్తులో నిలబడి పోరాడతారో చెబుతుంటే.. కూటమి ప్రచారం దానికి భిన్నంగా అధికార దర్పంతో సాగుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీనికితోడు కోడ్ అమలు చేయనీయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోడ్ అమలులోనూ కూటమి ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల పట్ల అధికారులు సైతం ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికారుల వ్యవహారశైలిపై 'ఇదేం తీరు' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

నిరుపయోగంగా ఆర్అండ్‌బి అతిథి గృహం

అసాంఘిక కార్యక్రమాలకు నెలవు
విలువైన సామగ్రి అపహరణ
పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రోడ్లు భవనాలు శాఖ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. దీనికోసం ఖర్చు చేసిన సుమారు కోటి రూపాయలు వృధా అయ్యాయి. కొంతపాటి మరమ్మతులతో అతిథి గృహాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ రోడ్లు భవనాల శాఖ పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీనికి చెందిన విలువైన సామగ్రి, మోటారు బోరు దొంగలపాలైనా రోడ్లు భవనాలు శాఖ నిర్లిప్తంగా ఉండటం పలు సందేహాలకు అవకాశం ఇస్తుంది. విశాలమైన ఆవరణ గల అతిథి గృహాన్ని అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రి, స్థానిక ఎంఎల్ఎ వట్టి వసంతకుమార్ చొరవతో నిర్మించారు. దీనిలో ఒకటి ఎసి, మరొకటి ఎసి రహిత అధునాతన నూతన సౌకర్యాలతో కూడిన సూట్లను ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా ప్రముఖులు వివిధ కాన్ఫరెన్స్‌లను నిర్వహించుకునేందుకు ఫర్నీచర్‌తో కూడిన సమావేశ మందిరాన్ని నిర్మించారు. నిరంతరం నీటి సరఫరా కోసం బోరుతో పాటు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. వీటన్నింటికీ తోడు అతిథి గృహంలో బస చేసేవారు, వారి కోసం వచ్చే అతిథులు, సహాయకుల కోసం అన్ని సౌకర్యాలను కల్పించారు. ఒక విధంగా ఇది ఒక రాష్ట్ర మంత్రి, లేదా ఉన్నత స్థాయి ప్రముఖులు తన పర్యటనలో భాగంగా బస చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అతిథి గృహంగా పేర్కొనవచ్చు. గతంలో బ్రిటిష్ పాలన సమయంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలతో పాటు రాజమండ్రి, ఏలూరు, భద్రాచలం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రముఖులు, అధికారులు బస చేసేందుకు భీమడోలుతో పాటు నల్లజర్లలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో అతిథి గృహాలను నిర్మించారు. వీటికి అదనంగా సరైన రహదారి సౌకర్యం లేక ద్వారకాతిరుమలకు వెళ్లే సాధారణ యాత్రికుల సౌకర్యం కోసం భీమడోలు కేంద్రంగా మూడు సత్రాలను అప్పట్లోనే నిర్మించారు. కాలక్రమేణా రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ఆ సత్రాలు మూతపడ్డాయి. ఆ ప్రాంతాల్లో ఇతర నిర్మాణాలు జరిగాయి. ఇక రోడ్లు భవనాల శాఖకు చెందిన భీమడోలు అతిథి గృహంలో కాలం చెల్లిన కనీస సౌకర్యాలు మెరుగుపడకపోవడంతో బస చేసే అధికారులు సంఖ్య క్రమేపి తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత కాలంలో దీనిని భీమడోలు టివి రిలే స్టేషన్‌గా మార్చారు. కొంతకాలం పాటు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత అతిథిగృహం మరింత శిథిలం కావడంతో టివి రిలే స్టేషన్‌ను స్థానికంగా ఉన్న అద్దె భవనంలోకి మార్చారు. టివి రంగంలోకి ఇతర టివి సేవలు అందుబాటులోకి రావడంతో టివి రిలే స్టేషన్ మూతపడింది. ఆ తర్వాత క్రమంలో దీనిపై దృష్టి సారించిన అప్పటి మంత్రి వసంతకుమార్ అతిథి గృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించారు. ఆయన నియోజకవర్గంలో పర్యటించే సమయంలో అతిథి గృహం ఆయన కార్యాలయంగా పనిచేసేది. ఇదే సమయంలో అతిథి గృహంలో పని చేసే సిబ్బంది కోసం ప్రత్యేక నిర్మాణాన్ని అతిథి గృహానికి అనుబంధంగా నిర్మించారు. ఒకప్పుడు జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి భీమడోలులో బస వేసేందుకు ఏర్పాట్లు చేశారు. కాని అప్పట్లో అతిథి గృహం చుట్టూ ప్రహరీ గోడ లేనందున ఆయన బస చేయటం సాధ్యం కాలేదు. దీనిని గమనించిన వసంతకుమార్ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రభుత్వం మారడంతో ఆ ప్రయత్నాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన ఎంఎల్ఎలు దీనిని తమ క్యాంపు కార్యాలయంగా వాడుకోవడం, సభలు సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగించుకునేవారు. ఇదే నేపథ్యంలో అప్పటి ఇప్పటి రోడ్లు భవనాల శాఖ అధికారులు అతిథి గృహం ఆవరణలోనే రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్, రక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు అనుమతించడంతో విశాలమైన అతిథి గృహ ఆవరణంలోని కొంత భాగం వారి పరిధి నుంచి తప్పుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులు అతిథి గృహం ప్రాముఖ్యతను గుర్తించారు. తిరిగి దానిని పునర్నియోగం తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కాని ఇప్పటివరకు ఫలప్రదం కాలేదు. ఈ విషయాలపై రోడ్లు, భవనాలు శాఖ భీమడోలు సహాయ ఇంజినీర్‌తో పాటు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను వివరణ కోరగా అతిథి గృహం శిథిలావస్థకు చేరిన మాట నిజమేనన్నారు. దీని మరమ్మతుల కోసం రూ.40 లక్షల అంచనాతో ప్రతిపాదనలను సమర్పించామన్నారు. నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఇదే సమయంలో అతిథి గృహం రక్షణకు వాచ్‌మెన్ నియామకం జరగాల్సి ఉందన్నారు. వీటితో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతులతో పాటు నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఇవన్నీ పూర్తయితే అతిథి గృహాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు అవసరం మేరకు నామమాత్రపు సామాన్యులు సైతం బస చేసే అవకాశం ఉందని తెలిపారు.


నిరుపయోగంగా ఉన్న భీమడోలు ఆర్అండ్‌బి అతిథి గృహం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులుకు మద్దతు ఇవ్వాలని మండలంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శక్ల భోయిన రాంబాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవులు 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 35 ఏళ్లు వివిధ బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. యూనియన్ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని ఐక్య ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. నేటి పాలకుల వైఖరి కారణంగా ప్రజలు కష్టాల్లో ఉన్నారని గ్రహించి వారికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో రాఘవులు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు ఆయనకు అధిక మెజారిటీతో గెలుపును అందించాలని ఓటర్లను కోరారు.


గోకుల షెడ్ ప్రారంభిస్తున్న ప్రముఖులు

గోకులం షెడ్ ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

గోకులం షెడ్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని టిడిపి గ్రామ అధ్యక్షులు బర్ల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును గ్రామ సర్పంచి పులిఖత్ లక్ష్మీసత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి లక్ష్మీసత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా రూ.మూడు లక్షల విలువైన గోకులం షెడ్‌ను నూటికి నూరు శాతం రాయితీతో నిర్మించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. అలాగే రైతుల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎస్‌సి వర్గీకరణపై వేసిన మిశ్రా కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఏలూరులోని విహార్ రోబో రెస్టారెంట్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సిలపై మన దేశానికి స్వతంత్రం రాకముందు నుంచి అంటరానితనం ఉండేదని, మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ కృషి వల్ల అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ తెలివితేటలతో ఎస్‌సిలకు 15 శాతం, గిరిజనులకు ఏడు శాతం రిజర్వేషన్లు రాజ్యాంగంలో కల్పించారన్నారు. సోనియాగాంధీ, అర్జున్ సింగ్ కృషి వల్ల విద్యా ఉద్యోగాల్లో ఓబిసిలకు 20 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకుని చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో మిశ్రా కమిషన్‌ను ఏర్పాటు చేశారని, దీనిని అడ్డం పెట్టుకుని గ్రామాల్లో, జిల్లాల్లో తగాదాలు పెట్టే విధంగా టిడిపి వ్యవహరిస్తుందన్నారు. ఈ 75 ఏళ్లల్లో 50 శాతం ఉన్న ఒబిసిలు ఒక్కరు కూడా ముఖ్యమంత్రి కాలేకపోయారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకొచ్చే ప్రసక్తే లేదన్నారు.

వృద్ధ కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వృద్ధ కళాకారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా సమన్వయకర్త టివిఎస్.రాజు ప్రభుత్వాన్ని కోరారు. తిరుమలదేవిపేట గ్రామంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కళాకారులు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. ప్రస్తుతం చాలామంది కళాకారులు మంచానికే పరిమితమై దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వృద్ధ కళాకారులకు ఇచ్చే రూ.నాలుగు వేలు ఎటూ చాలడం లేదని, రూ.పది వేలకు పెంచి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.


ఆలెండజోల్ మాత్రలు అందిస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఆసక్తి పెరుగుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు షకీనా ఇవాంజెలిన్ అన్నారు. మండలంలోని ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు నూలి పురుగుల నివారణ మాత్రలు అందించారు. అదేవిధంగా గతంలో కంటి పరీక్షలు చేసిన విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ అంధత్వం నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ కె.ప్రవీణ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం కాపాడుకోవాలంటే పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొయ్యలగూడెం : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నారు. బయ్యన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) వైద్యాధికారులు డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ ఎం.గీతారాణి ఈ విషయాన్ని వెల్లడించారు. బయ్యన్నగూడెం పిహెచ్‌సి పరిధిలోని 24 పాఠశాలల్లో 4,738 మంది విద్యార్థులకు, 31 అంగన్వాడీ కేంద్రాల్లో 1,075 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు వైద్యులు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల పనులను పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెర్రీ రేవులో కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం నది ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్లు బట్టలు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు ఇతర మౌలిక వసతుల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు వెంకటేశ్వరరావు, బాపిరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్‌నా యుడు, ఉప సర్పంచి నునకాని రమ్యలతాధర్మేంద్ర, ఫెర్రీ కాంట్రాక్టర్ బొరుసు రాంబాబు పాల్గొన్నారు. నదిలో యాత్రికులు రాకపోకలు సాగించేందుకు పంట్ల ఏర్పాటు కోసం ఇసుక డ్రెజ్జింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు.

10న టెండర్లు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పలు ఏర్పాట్లకు పదో తేదీ సోమవారం టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పామర్తి సీతారామయ్య అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వాటిలో భాగంగా క్యూలైన్లు ఏర్పాట్లు, షాపులు, పలు దుకాణాలు, పారిశుధ్య కార్మికుల సమకూర్చటం ఇలా పలు విభాగాలపై ఆలయ ఉన్నతాధికారుల సమక్షంలో, గ్రామ పెద్దల సమక్షంలో టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.


పాదయాత్రగా వస్తున్న యాత్రికులు

యాత్రికులతో చినవెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

భీష్మ ఏకాదశి సందర్భంగా ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం యాత్రికులతో శనివారం కిటకిటలాడింది. పెద్దఎత్తున యాత్రికులు చినవెంకన్నను దర్శించుకున్నారు. హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో పది వేల మంది యాత్రికులు పాదయాత్రగా జంగారెడ్డిగూడెం, లక్కవరం, అశ్వారావుపేట, శ్రీనివాసపురం, బుట్టాయగూడెం ఏరియాల నుంచి చినవెంకన్నను దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. పాదయాత్రగా తరలివచ్చిన యాత్రికులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు తెలిపారు.

ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్

పట్టభద్రుల ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థి హాసన్ షరీఫ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి మండలంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి పదో తరగతి నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, పట్టభద్రులు తమ ఓటు తనకు వేసి గెలిపించాలని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థి హాసన్ షరీఫ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థి హాసన్ షరీఫ్ శనివారం ఏలూరులో ప్రచారం నిర్వహించారు. ఏలూరు బార్ క్లబ్ నాయకులను, న్యాయవాదులను కలిసి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.


వేడుకల్లో ఎంఎల్ఎ, మేయర్

శ్రీరామకోటి 93వ మహోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

శ్రీ రామకోటి 93వ మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకలకు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్‌ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మేయర్ నూర్జహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ వేలాది మంది ఇక్కడికి వచ్చి పలువురు పెద్దలు మన సంస్కృతి సాంప్రదాయాలను హరి కథల ద్వారా, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా అనేక విషయాలు తెలియజేస్తున్నారన్నారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎంతో ప్రాముఖ్యమైన రామకోటి ప్రాంగణంలో 93వ రామకోటి మహోత్సవం రామకోటి మందిర కమిటీ ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్లో సరస్వతి పూజ

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో శనివారం సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు, స్కూల్ డైరెక్టర్ సిహెచ్.నితిన్ ఆధ్వర్యంలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులచే సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉత్తమ సేవలందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ
ప్రత్యేక ఉపాధ్యాయులకు ముగిసిన మూడు రోజుల శిక్షణ

ప్రజాశక్తి - దెందులూరు

ప్రత్యేక ఉపాధ్యాయులు వికలాంగులకు ఉత్తమ సేవలందించాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, డిసిఇబి సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని, ప్రతి ప్రత్యేక ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా తెలుసుకున్న అంశాలను వికలాంగుల అభివృద్ధికి తోడ్పడేలా చూడాలని చెప్పారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రస్తుతం 21 రకాల వికలాంగత్వాలుగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ వాటిపై అవగాహన కల్పించుకుని సమాజంలో వికలాంగులుగా ఉన్నవారికి సహాయపడాలని సూచించారు. ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ వారు భవిష్యత్తులో మరికొన్ని శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బి.రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధునిక విద్య విధానాలను తెలుసుకుని వికలాంగులకు సేవలందించాలని చెప్పారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పెద్దిరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ గత 37 ఏళ్లుగా అనేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రత్యేక టీచర్లందరూ తమ పరిధిలో ఉన్న వికలాంగులకు ఉత్తమ సేవలందిచాలన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ ఇ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, నాయుడు, రాంజీ, హరిబాబు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

బలివే వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు

దెందులూరు ఎంఎల్ఎ ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 26వ తేదీన జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు బలివే ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామని దెందులూరు ఎంఎల్ఎ ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి వద్ద తమ్మిలేరుపై నిర్మించిన బలివే బ్రిడ్జితో పాటు ఘాట్లను ఆయన శనివారం కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ విజయరాయి వద్ద తమ్మిలేరుపై ఉన్న బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను గుర్తించి తాము టిడిపి ఎంఎల్ఎగా ఉన్న 2019లోనే ఈ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. గత ఐదేళ్ల వైసిపి అసమర్థ పాలనలో కనీసం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయలేకపోయారని, ఘాట్ల నిర్మాణం కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మళ్లీ తాను ఎంఎల్ఎగా బ్రిడ్జి, ఘాట్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా బలివే వచ్చే యాత్రికులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణతో పాటు, గతం కన్నా మెరుగైన స్థాయిలో జల్లు స్నానాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా భాగస్వామ్యమై యాత్రికులకు మెరుగైన సేవలందించాలని ఎంఎల్ఎ సూచించారు.


ఘట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

విద్యార్థులకు ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - దెందులూరు

సాధించాలనే కోరిక, సంకల్పం, క్రమశిక్షణలతో కూడిన త్రీడి ఫార్ములా పాటిస్తే ఏ విద్యార్థి అయినా జీవితంలో విజయం సాధిస్తారని ఏలూరు జిల్లా సాంఘిక సంక్షేమ, జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ అన్నారు. స్థానిక అమీనాపేటలో ఉన్న బాలికల వసతిగృహ ప్రాంగణంలో ఎఎస్‌డబ్ల్యూ ఏలూరు ఏరియాలో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పుస్తకాలు బాగా చదివినవారు అన్ని పోటీ పరీక్షలో సఫలమవుతారన్నారు. సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల్లోనూ, పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ, ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సీట్లు సాధిస్తారన్నారు. సాంఘిక సంక్షేను కార్యాలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ జవాబులు పదే పదే పునశ్చరణ చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధిస్తారన్నారు. ఎఎస్‌డబ్ల్యూ బి.రమేష్ మాట్లాడుతూ ఉన్నత విద్యకు పదో తరగతే మొదటి మెట్టని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇఎంహెచ్‌సి ఏలూరు-1 డబ్ల్యూహెచ్‌ఒ కొవ్వలి, కూచింపూడి, ఏలూరు బాలికల వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు. వసతి గృహ వార్డెన్స్ వి.విజయలక్ష్మి, సత్యనారాయణ, రామారావు, సురేష్, రాజాబాబు, రాధాదేవి, ఆర్ఎస్.మంగళ వెంకటేశ్వరమ్మ, మెంటార్స్ రాగోలు రామారావు, లక్ష్మణ కుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి బోదెలో అడ్డంకుల తొలగింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు రైల్వే గేటుకు అటువైపు పలు పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో పాటు స్థానిక నివాసితుల ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహించే బోదెపై అడ్డంకులను పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం కూలీలతో తొలగించారు. దుర్వాసనతో కూడిన మురుగు వ్యర్థాలు ఆగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు రాకుండా గ్రామస్తులు రెండు రోజుల క్రితం అడ్డు కట్ట వేసేశారు. దీంతో పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి మురుగునీరు సాఫీగా ప్రవహించేలా రైల్వే ట్రాక్ వెంబడి కచ్చా మురుగు బోదెను శుభ్రం చేయించారు. సగం సమస్య తీరిందని సర్పంచి బండారు సింధు, కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్ వెల్లడించారు. ఉంగుటూరులో పరిశ్రమల వ్యర్థాలు ఈ బోదెలో కలువకుండా ప్రత్యేక పైపు మార్గాన్ని నిర్మించేలా కాలుష్య, పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు కోసం పరిశ్రమల సంఘం ప్రయత్నాలు చేపట్టింది.


మురుగునీటి ప్రవాహానికి అడ్డు తీస్తున్న కూలీలు

జనార్ధన్‌రావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రముఖ పారిశ్రామికవేత్త వెల్జన్ డేనిషన్ ఇండస్ట్రీస్ అధినేత, కొవ్వలికి చెందిన చంద్రశేఖర జనార్ధన్‌రావు మృతి చెందిన నేపథ్యంలో శనివారం రెడ్‌క్రాస్ సిబ్బంది ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వైద్యులు ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ జనార్ధన్‌రావు రెడ్‌క్రాస్ తలసేమియా భవనాన్ని వారి తల్లిదండ్రుల పేరు మీదగా ఏర్పాటు చేసి ఎంతోమంది తలసేమియా, హిమోఫిలియా, సికిల్‌సెల్, ఎనీమియా చిన్నారులకు రక్తమార్పిడి జరిగేలా చేశారన్నారు. జనార్ధన్‌రావు మృతి రెడ్‌క్రాస్ సొసైటీకే కాకుండా ఈ సమాజానికి కూడా కూడా తీరని లోటన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, విఎస్ఆర్‌కె.ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో ప్రజలు

శ్రీదత్తసాయి సేవా సదనం భవన ప్రారంభం

భారీ అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో స్థానిక షిర్డీ సాయి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ దత్తసాయి సేవా సదనం భవనాన్ని శనివారం దత్తసాయి సేవా సంఘం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నాళం వెంకటేశ్వరరావు మాధవి దంపతులు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాళం తిలక్ మాట్లాడుతూ శ్రీ దత్తసాయి సేవా సదనం అన్నదాన నిర్వహణలకు, ప్రత్యేక కార్యక్రమాల విందులకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దత్తసాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం, శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో లక్షపత్రి పూజ స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. గుంజవరం ఉమాసహిత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో, పాతపోలవరం పద్మావతి అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

ఎంఎల్‌సిగా రాజశేఖరం గెలుపునకు సమైక్యంగా పనిచేద్దామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి, లింగపాలెం మండలాల బిజెపి కేడర్‌తో ఎంఎల్ఎ రోషన్‌కుమార్ చింతలపూడి క్యాంపు కార్యాలయంలో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎంఎల్‌సిగా రాజశేఖరం గెలుపునకు అందరూ కష్టించి పని చేయాలని సూచించారు.

జీలుగుమిల్లి : త్వరలో జరిగే ఉమ్మడి గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలను విజయవంతం చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో టిడిపి కూటమి కార్యకర్తలతో ఎంఎల్‌సి ఎన్నికలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా రాజశేఖరం పోటీ చేస్తున్నారని, అందరం కలిసి ఆయనను గెలిపించుకోవాలని కూటమి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రవి, పి.రాము, ప్రసాద్, ఎ.నాగరాజు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఓటర్లను కూటమి అభ్యరి రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు దేవరపల్లి వీరస్వామి చౌదరి, గ్రామ కమిటీ అధ్యక్షులు రేగంటి రాంబాబు, గ్రామ సర్పంచి కస్సే శ్రీహరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాచమంటే శ్రీను, మండల బిసి నాయకులు మట్టపర్తి రూపేష్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.